సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 5 । మార్చి । 2023



సో'షా'లో' మీడియా..!

సోషల్ మీడియాకు ఉన్న క్రేజీని సద్వినియోగం చేసుకుంటున్నాయి రాజకీయ పార్టీలు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నాయకులు సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై దృష్టి సారించారు. 8లో▸



నేడు గురుకుల సీవోఈ సెట్

ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ) ప్రవేశ అర్హత పరీక్ష నేడు నిర్వహించనున్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.0/21.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది. పగటిపూట ఎండ ప్రభావంతో ఉక్కపోత పెరగనుంది.

న్యూస్‌రీల్

మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు

ఆదిలాబాద్‌అర్బన్: హోలీ పండుగ నేపథ్యంలో ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు రెండు రోజుల పాటు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కుమ్ర విజయలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో పత్తి, శనగల కొనుగోళ్లు ఉండవని, ఈ మేరకు యార్డుకు తీసుకురావద్దని రైతులకు సూచించారు. గురువారం నుంచి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

తాంసి: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీని శనివారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో వసతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, స్నాక్స్ అందజేత తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇష్టపడి చదవాలని సూచించారు. వారి వెంట ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌రెడ్డి, కేజీబీవీ ప్రత్యేకాధికారి అలేఖ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

హోలీ మంగళవారం నిర్వహించుకోవాలి

ఆదిలాబాద్: కామ దహనం సోమవారం నిర్వహించుకుని, హోలీ పండగ మంగళవారం జరుపుకోవాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి అన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మఠంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామ దహనంలో రావి, మర్రి, మేడి, మోదుగ, జామ, తిప్పతీగ, టేకు, మద్ది కట్టెలు, ఆవుపేడ పిడకలను వాడాలన్నారు. హోలీని ప్రకృతి సిద్ధంగా లభించే రంగులతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి మాధవ్, కోశాధికారి సూర్యకాంత్, గౌరవ సభ్యులు రవీందర్, లక్ష్మీకాంత్, శ్రీనివాస్, రాజు, దేవన్న పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ అందించాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీలకు సీపీఆర్‌పై శిక్షణ తరగతులు నిర్వహించాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈమేరకు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను శనివారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భీముడు, నర్సింలు, తదితరులు ఉన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

బీజేపీలో జోష్

- కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన 'బండి' పర్యటన
- అడుగడుగునా ప్రజాదరణ.. చేరికలతో సందడి
- ఆదిలాబాద్‌లో పోటీ చేయాలంటూ ఎంఐఎంకు సంజయ్ సవాల్
- 'మిస్టర్ 40 పర్సెంట్' అంటూ స్థానిక ఎమ్మెల్యేపై సెటైర్

సాక్షి, ఆదిలాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ జిల్లా పర్యటన ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలో కొనసాగిన ర్యాలీలో అడుగడుగునా ప్రజాదరణ కనిపించింది. చేరికలతో సందడి నెలకొంది. సంజయ్ ప్రసంగం బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేస్తూ సాగింది. కేసీఆర్ ప్రభుత్వ తీరును విమర్శిస్తూ.. మోదీ కారణంగా దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం తీసుకురావాలంటూనే.. ఎంఐఎంపై ధ్వజమెత్తారు. మొత్తంగా ఆయన పర్యటన విజయవంతమైంది. కాగా సభ అనంతరం ఇటీవల మెడికో ప్రీతి మృతిపై నివాళులర్పిస్తూ బీజేపీ నాయకులు ప్రాంగణం నుంచి కొంత దూరం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

అలస్యంగా రాక..

జిల్లా కేంద్రానికి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బండి సంజయ్ చేరుకుంటారని ముందుగా ఆ పార్టీ వర్గాలు వెల్లడించగా..ఆయన మాత్రం సాయంత్రం 6.45 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. స్థానిక ఠాకూర్ హోటల్ వద్ద సంజయ్‌కు ఎంపీ సోయం బాపూరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఓపెన్‌టాప్ వాహనంలో అక్కడి నుంచి ఆయన పట్టణంలో ర్యాలీగా కదిలారు. వందలాది మంది కార్యకర్తలు పాల్గొనడంతో సభ ప్రాంగణానికి వచ్చేసరికి గంటకు పైగా సమయం పట్టింది. రాత్రి 8.30 గంటల ప్రాంతంలో స్థానిక జనార్దన్‌రెడ్డి గార్డెన్‌కు చేరుకున్నారు. అప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి పలువురు నేతలు తరలివచ్చారు. జిల్లాకేంద్రంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.



సభకు తరలివచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రఘుపతిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

భారీగా చేరికలు..

మావల మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, డీసీసీబీ డైరెక్టర్ దుర్గం రాజేశ్వర్, నాయకులు దారట్ల జీవన్, ఇతరులు బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి కూడా కార్యకర్తలు కమలం గూటికి చేరారు. కాగా వందలాది మంది చేరికలతో వేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయింది. బండి సంజయ్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకొని ఫొటో దిగేందుకు ఆసక్తి కనబర్చడంతో అక్కడ అదుపు చేయలేని పరిస్థితి కనిపించింది.

ఎంఐఎంకు సవాల్..

సభకు జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అధ్యక్షత వహించారు. ఆయనతో పాటు సోయం బాపురావు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను లేవనెత్తారు. ప్రధానంగా రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం కేంద్రం రూ.150 కోట్లు కేటాయించి నిర్మిస్తే ఇప్పటికీ స్టాఫ్‌ను నియమించకపోవడంపై విమర్శలు గుప్పించారు. కొరటా–చనాఖా బ్యారేజ్ నుంచి ఇప్పటివరకు ఒక్క ఎకరం కూడా పారలేదని ధ్వజమెత్తారు. పిప్పల్‌కోటి రిజర్వాయర్ కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం తగ్గించి ఇవ్వడంపై ప్రభుత్వ తీరును ఎండగట్టారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నను మిస్టర్ 40 పర్సెంట్ అంటూ సెటైర్ వేశారు. ప్రతి అభివృద్ధి పనుల్లో అంత కమీషన్ తీసుకుంటారంటూ ధ్వజమెత్తారు. మరోవైపు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతూ అందినకాడికి దండుకుంటున్నారని విమర్శలు చేశారు. పోడు భూముల సమస్యను ఈ ప్రభుత్వం పరిష్కరించలేక పోతుందన్నారు. ఎంఐఎం పార్టీకి బండి సంజయ్ సవాల్ విసిరారు. పౌరుషం ఉంటే ఆదిలాబాద్ గడ్డమీద పోటీ చేయాలన్నారు. కాషాయ భగభగ ముందు మసి కావడం ఖాయమన్నారు. ఈ గడ్డ మీద కాషాయ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నేతలు పాల్గొన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డి, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, సీనియర్ నాయకులు రామారావు పటేల్, ఖానాపూర్ నాయకులు హరినాయక్, సట్ల అశోక్, రాష్ట్ర నాయకులు సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్.సునీత

కైలాస్‌నగర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించేలా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.ఆర్.సునీత అన్నారు. మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మహిళలు, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. గర్భస్థ శిశువును కాపాడుకోవడం నుంచి మరణించే వరకు మహిళల కోసం అనేక చట్టాలు అండగా ఉన్నాయని గుర్తు చేశారు. మగవారిని తీర్చిదిద్దే బాధ్యత ఒక్క మహిళకే సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగుతూ వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి మాధవీకృష్ణ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, జూనియర్ సివిల్ జడ్జి మంజుల, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీళ జైన్, ఆర్టీసీ డీఎం కల్పన, జైనథ్ ఎస్సై బిట్ల పెర్సిస్, డీఆర్‌డీఏ డీపీఎం హేమలత, సఖీ కేంద్ర కోఆర్డినేటర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

లక్ష్యం దిశగా..

- గ్రామాల్లో ఊపందుకున్న పన్నుల వసూళ్లు
- 125 పంచాయతీల్లో వందశాతం కంప్లీట్
- జిల్లా వ్యాప్తంగా 76 శాతం పూర్తి
- శతశాతం కోసం శ్రమిస్తున్న కార్యదర్శులు

జిల్లాలోని గ్రామ పంచాయతీలు 468
పన్ను వసూళ్ల లక్ష్యం రూ.5,92,19,747
ఇప్పటివరకు వసూలు చేసింది రూ.4,55,65,545
ఇంకా వసూలు చేయాల్సింది రూ. 1,36,50,344



పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

కైలాస్‌నగర్: గ్రామ పంచాయతీ పన్నుల వసూళ్లు లక్ష్యం దిశగా సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 27 రోజుల గడువు మాత్రమే ఉండటంతో వంద శాతం పన్నుల వసూళ్లకు పంచాయతీ సిబ్బంది చెమటోడ్చుతున్నారు. ఇప్పటి వరకు 76 శాతం పైబడి వసూలు చేయగా మిగిలిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో ఉదయం నుంచే రిజిస్టర్లు పట్టుకుని ఇంటింటికి తిరుగుతున్నారు.

లక్ష్యం రూ.5.92 కోట్లు.. వసూలైంది రూ.4.55 కోట్లు

జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను రూ.5,92,19,748 వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో గతేడాదికి సంబంధించిన బకాయిలు రూ.31,03,214 ఉన్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు రూ.4.55 కోట్లు వసూలు చేశారు. వీటిలో పాత బకాయిలు రూ.20.28లక్షలు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించినవి రూ.4.35 కోట్లు ఉన్నాయి. ఇక 125 జీపీలు ఇప్పటికే వందశాతం వసూలు చేసి ఆదర్శంగా నిలిచాయి. మిగిలిన పంచాయతీల్లోనూ లక్ష్య సాధనకు సిబ్బంది కృషి చేస్తున్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి వసూళ్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

గాదిగూడ టాప్... ఉట్నూర్ లాస్ట్

పన్నుల కలెక్షన్‌లో ఏజెన్సీ ప్రాంతమైన 28 జీపీలతో కూడిన గాదిగూడ మండలం 92శాతంతో జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచింది. 37 పంచాయతీలు కలిగిన ఉట్నూర్ మండలం 62శాతంతో చిట్టచివరి స్థానంలో నిలిచింది. మిగతా మండలాల్లో దాదాపు 77 నుంచి 84శాతం వరకు పన్నులను వసూలు చేశారు. వసూళ్లలో వెనుకబడిన పంచాయతీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఎలాగైనా లక్ష్యాలను సాధించాలని కార్యదర్శులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నారు.

మండలాల వారీగా పన్ను వసూళ్ల వివరాలు

మండలం	మొత్తం జీపీలు	వందశాతం సాధించిన జీపీలు
ఆదిలాబాద్	34	05
బజార్‌హత్నూర్	30	05
బేల	37	12
భీంపూర్	26	04
బోథ్	33	03
గాదిగూడ	25	17
గుడిహత్నూర్	26	08
ఇచ్చోడ	32	04
ఇంద్రవెల్లి	28	11
జైనథ్	42	11
మావల	03	-
నార్నూర్	23	03
నేరడిగొండ	32	12
సిరికొండ	19	03
తలమడుగు	28	09
తాంసి	13	08
ఉట్నూర్	37	10

వంద శాతం వసూలు చేస్తాం

జిల్లాలో వంద శాతం పన్నులను వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి తదనుగుణంగా పనిచేయడంతోనే ఇప్పటి వరకు రూ.4.55 కోట్లకు పైబడి వసూలు చేయగలిగాం. ఇంకా సమయమున్నందున మిగతా లక్ష్యాలను సైతం చేరుకుంటామనే నమ్మకముంది. పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపైనే దృష్టి సారించారు. ప్రజలు తమ ఇళ్ల వద్దకు వచ్చే సిబ్బందికి పన్ను చెల్లించి గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలి. – పి.శ్రీనివాస్, డీపీఓ, ఆదిలాబాద్

తొమ్మిది మంది తహసీల్దార్ల బదిలీ

కైలాస్‌నగర్: జిల్లాలో తొమ్మిది మంది తహసీల్దార్లకు స్థాన చలనం కలిగింది. ఈ మేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తలమడుగు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్‌ను మావలకు, అక్కడ పనిచేస్తున్న వనజారెడ్డిని తలమడుగుకు బదిలీ చేశారు. అలాగే బజార్‌హత్నూర్ తహసీల్దార్ కె.గంగాధర్‌ను ఇంద్రవెల్లికి, అక్కడ పనిచేస్తున్న ఎం.సోమును బజార్‌హత్నూర్‌కు బదిలీ చేశారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ వర్దను సిరికొండకు బదిలీ చేయగా, అక్కడి పని చేస్తున్న సర్ఫరాజ్ నవాబ్‌కు బేలకు, బేల తహసీల్దార్‌గా ఉన్న బి రాంరెడ్డిని కలెక్టరేట్ సూపరిటెండెంట్‌గా బదిలీ చేశారు. గాదిగూడ తహసీల్దార్ మోతీరాంను నార్నూర్‌కు, అక్కడ పని చేస్తున్న డి.లక్ష్మణ్‌ను గాదిగూడకు బదిలీ చేశారు. కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ బాధ్యతలు చేపట్టాక భారీ స్థాయిలో బదిలీలు రెవెన్యూశాఖలో చర్చనీయాంశంగా మారాయి. కొంతమందిపై భూవ్యవహారాలకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో ఈ బదిలీలు చేపట్టినట్లు తెలిసింది.



క్లుప్తంగా

తప్పిపోయిన చిన్నారిని కుటుంబీకులకు అప్పగింత



కుటుంబీకులకు అప్పజెప్పుతున్న పోలీసులు

నేరడిగొండ: మండల కేంద్రంలో శనివారం వారసంతో ఓ చిన్నారి తప్పిపోయింది. స్థానికులు ఆ చిన్నారిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. రాకేష్‌-నిషాల కూతురిగా నిర్ధారణ చేసిన పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా మండల ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి చిన్నారిని వాట్సాప్‌లో చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు.

యువతి అదృశ్యం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రామ్‌రావు బాగ్‌కు చెందిన యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు శనివారం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఇటీవలే యువతికి వివాహం కుదిరింది. రెండు రోజుల క్రితం జరగాల్సిన నిశ్చితార్థం ఆగిపోయింది. యువతి పనిచేస్తున్న కార్యాలయం సమీపంలో వ్యాపారం నిర్వహిస్తున్న వంశీకృష్ణ దంపతులతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరూ ఆమెతో చనువు పెంచుకుని యువతిని ట్రాప్ చేశారు. ఇదే క్రమంలో వారు కావాలని ఆమె నిశ్చితార్థాన్ని రద్దు చేశారు. దీంతో సదరు యువతి మనస్తాపానికి గురై ఉత్తరం రాసి ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఘటనకు కారణమైన వంశీకృష్ణ దంపతులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు వంశీకృష్ణ దంపతులను అరెస్టు చేసి ప్రిన్సిపల్ జడ్జి ఎదుట హాజరుపరిచారు. జడ్జి తీర్పు అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యం

భైంసారూరల్: కుంటాల మండలంలోని అబుగాం గ్రామానికి చెందిన భోజాబాయి, తన కుమారుడు భరత్‌వాజ్‌లు అదృశ్యమైనట్లు భైంసా రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భోజాబాయి, తన కుమారుడు భరత్‌వాజ్ కుతురు ప్రణాళిని తీసుకుని పుట్టింటికి గత నెల 23న వచ్చింది. ఇంట్లో కుటుంబీకులు లేకపోవడంతో కుతురు ప్రణాళిని పుట్టింటి వద్ద ఉంచి అమ్మమ్మ వస్తుందని చెప్పి కుమారుడిని తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లీ కొడుకులు కనిపించకపోవడంతో కుటుంబీకులు గాలిస్తున్నారు. ఆచూకీ తెలియకపోవడంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కదాడిలో ఒకరికి గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని ఆరో వార్డు పరిధిలోని సాయినగర్ కాలనీకి చెందిన బడుగు భీమక్క అనే వృద్ధురాలిపై ఊరకుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. గాయపడ్డ వృద్ధురాలిని స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కొద్ది రోజులుగా పట్టణంలో వరుస దాడులతో జనం బెంబేలెత్తుతున్నారు. కుక్కల బెడద తీవ్రమైందని సంబంధిత అధికారులు చొరవ తీసుకుని కుక్కలను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

సోఫాలో మీడియా..!



- సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ
- ప్రజాప్రతినిధులు, నాయకుల ప్రత్యేక దృష్టి
- కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు పోస్టులు

సండే స్పెషల్

సాక్షి, మంచిర్యాలడెస్క్: సోషల్ మీడియాకు ఉన్న క్రేజీ అంతా ఇంతా కాదు. ఫేస్‌బుక్.. ఇన్‌స్టాగ్రాం.. ట్విట్టర్ ఇలా ఏదో ఒక వేదికగా చాలామంది సోషల్ మీడియాలో ఖాతాలు నిర్వహిస్తున్నారు. ఒక్కో వ్యక్తి రోజులో సగటున రెండున్నర గంటలు సామాజిక మాధ్యమాలపై గడుపుతున్నారు. అందుకే సోషల్ మీడియా అనేది సమాచార వ్యాప్తికి ప్రధాన వారధిగా మారింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రధాన పార్టీల నాయకులు సోషల్ మీడియా ఖాతాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. రోజువారీగా కార్యక్రమాలు, పర్యటనలు ఫొటోలతో పోస్టు చేయిస్తున్నారు.

ప్యాకేజీ..

సోషల్ మీడియాలో పండుగలు, నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు, శుభాకాంక్షలు తెలియజేయడం, ప్రభుత్వ పథకాలపై పోస్టుల కోసం ప్యాకేజీతో కొందరు పని చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల సమయంలో ప్రజాప్రతినిధుల ఫొటోలతో డిజైన్ చేసి ఇస్తుంటారు. ఏడాదికి ప్యాకేజీ రూ.2.50లక్షల వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం.

ప్రత్యేక సిబ్బంది

ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న నాయకుల వద్ద సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్కొక్కరి వద్ద ఇద్దరు నుంచి ముగ్గురు ఉన్నా రు. వ్యక్తిగత పీఆర్‌వోలు, పీఏలుగా వ్యవహరిస్తున్నారు. వీరికి కనిష్టంగా రూ. 15వేల నుంచి గరిష్ఠంగా రూ.30వేల వరకు వేతనం చెల్లిస్తున్నారు. అభివృద్ధి పనులు, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సమయంలో ఫొటోలు, ఆ అంశానికి సంబంధించిన సమాచారం పోస్టు చేయడమే వీరి పని. కొంతమంది ప్రజాప్రతినిధులకు సంబంధించిన వారు హైదరాబాద్ నుంచి ఖాతాల నిర్వహణ చూస్తున్నారు. ఇక్కడున్న వారు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తుంటారు. ఫొటోలు తీయడానికి ప్రత్యేకంగా ఫొటోగ్రాఫర్లు కూడా ఉన్నారు.

పార్టీల్లో సోషల్ మీడియా కమిటీలు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ సోషల్ మీడియా కమిటీలు కూడా వేశాయి. మండలం, నియోజకవర్గాల వారీగా కన్వీనర్లు, కోఆర్డినేటర్లుగా ఉన్నారు. ఆయా పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా పని చేస్తున్నారు. తమ తమ పార్టీల విధానాలను ప్రచారం చేస్తూనే ప్రత్యర్థి పార్టీలను ప్రశ్నిస్తున్నారు.

కొత్త పంథా..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆదిలాబాద్ జిల్లాలోని ఓ ఎన్‌ఆర్‌ఐ ప్రత్యేకంగా రెండు టీవీ చానళ్లనే తీసుకొచ్చారు. జిల్లాతోపాటు మరికొన్ని జిల్లాల్లో ఈ చానళ్ల ప్రసారాలు వస్తున్నాయి. ప్రధానంగా ఆయనకు సంబంధించిన కార్యక్రమాలు ప్రసారం చేస్తూనే మరికొన్ని ప్రసారాలు వస్తుంటాయి.

- నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రతిపక్ష పార్టీ నాయకుడు సోషల్ మీడియాలో ఖాతాల నిర్వహణపై అంతగా దృష్టి సారించకున్నా.. తనదైన శైలిలో మూడు, ఆరు నెలలకోసారి సర్వే చేయిస్తుంటారు. తన కార్యక్రమాలు, ప్రజల స్పందన ఎలా ఉందనే వాటిపై ఆరా తీస్తుంటారు. అందుకు అనుగుణంగా తన ప్రణాళిక మార్చుకుంటున్నారు.

కమ్యూనిస్టు పార్టీలూ...

తూర్పు జిల్లాలో కమ్యూనిస్టు పార్టీల నాయకులూ సోషల్ మీడియాలో చురుగ్గానే ఉన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లోని సీపీఎం, సీపీఐ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు కార్యకలాపాలను సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారం చేస్తున్నారు.

ఖాతాల్లో అనుసరణ ఇలా

	Facebook	Twitter
చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్	1,19,000	1,91,000
మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి	73000	39,300
మంచిర్యాల ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు	23,000	12,400
ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న	16000	14,200
బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు	8,200	2,016
సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప	45,000	5,524

ప్రజాప్రతినిధులు/నాయకుల ఫేస్‌బుక్‌లో ఫాలోవర్లు

ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు	13,000
బీజేపీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్	3,200
బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య	2,400
కాంగ్రెస్ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి	62,000
ముధోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి	6,100
మంచిర్యాల బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి	33,000
మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు	13,000
ఆదిలాబాద్ బీజేపీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి	51,000

ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తాం



ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం. ఆదిలాబాద్ మున్సిపాల్టీతోపాటు నియోజకవర్గంలోని మావల, బేల, జైనథ్, ఆదిలాబాద్ రూరల్ మండలాల బీఆర్‌ఎస్ శ్రేణులకు సమాచారం చేరవేస్తాం. ఫేస్‌బుక్, వాట్సాప్‌లో ప్రచారం చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం.

– ప్రశాంత్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి, ఆదిలాబాద్

కార్యక్రమాలు తెలియజేస్తాం..



సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తుంటాం. మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావుకు సంబంధించి పార్టీ కార్యక్రమాలను మీడియా, సోషల్ మీడియాలో పంపించే బాధ్యతలు చూస్తున్నాను. పార్టీ అధిష్టాంతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్‌మీడియా ద్వారా పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతిధులకు చేరవేస్తుంటాను.

– దాసరి సాయికృష్ణ, మంచిర్యాల నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్

ప్రజల నుంచి సానుకూల స్పందన



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు, ప్రజావ్యతిరేక విధానాలపై సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటా ను. ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తుంది. నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీల నాయకుల విధానాలు, వారిపై వస్తున్న వ్యతిరేకతను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తుంటాను. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీ సుకెళ్లడానికి సోషల్ మీడియా ఉపయోగపడుతుంది.

– వేల్పుల రోహిత్, కాంగ్రెస్ పార్టీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న అధికారులు

కడెం: అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఖానాపూర్, జన్నారం ఎఫ్‌డీవోలు కోటేశ్వర్‌రావు, మాధవరావు అన్నారు. శనివారం మండలంలోని ఉడుంపూర్ ఆటవీ రేంజ్ పరిధిలోని కల్పకుంట వద్ద కెరమెరి, ఆసిఫాబాద్, ఖానాపూర్, జన్నారం, ఇంధన్‌పల్లి, బీర్సాయిపేట్, ఉట్నూర్, ఉడుంపూర్, కడెం, ఆటవీ రేంజ్‌ల సిబ్బందితో క్లస్టర్ బార్డర్ ప్రొటెక్షన్ మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. కలప అక్రమ రవాణను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అడవుల సంరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇందులో ఎఫ్‌ఆర్వోలు అనిత, అప్పలకొండ, గులాం మెయినోద్దిన్, అనిత, హఫీజొద్దిన్, శశిధర్‌బాబు, డీఆర్వోలు ప్రకాష్, సిద్ధార్థ, ప్రకాష్ ఉన్నారు.



అటవీ అధికారుల బృందం

గొల్లఘాట్ అటవీ ప్రాంతంలో మంటలు

తాంసి: భీంపూర్ మండలంలోని గొల్లఘాట్ గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో శనివారం మంటలు అంటుకుని గ్రామానికి సమీపం వరకు వ్యాపించాయి. అప్రమత్తమైన గ్రామస్తులు వెంటనే మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ప్రస్తుతం పంటచేన్లలో ఉన్న పత్తి కర్రలను రైతులు తగులబెట్టే క్రమంలో నిప్పురవ్వలు చేలరేగి మంటలు అటవీ ప్రాంతంలోకి వ్యాప్తి చెంది ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు.



అడవిలో మంటలు

రోడ్డు ప్రమాదంలో కూతురు మృతి.. తండ్రికి గాయాలు

- బైక్‌ను ఢీకొన్న ప్రైవేట్ స్కూల్ బస్సు
- ఆరోగ్యం బాగాలేక తండ్రితో ఇంటికి వస్తుండగా ఘటన
- ఉద్యోగం వచ్చిన మూడు నెలలకే..



కల్పన (ఫైల్)

సారంగపూర్: కుటుంబాన్ని పోషించేందుకు ఆ కుటుంబం వలస వచ్చింది. తండ్రి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి కష్టాన్ని గుర్తించిన కూతురు కష్టపడి చదువుకుని మూడు నెలల క్రితమే ఉద్యోగం సాధించింది. ఆరోగ్యం బాగులేక ఇంటికి తండ్రితో కలిసి వస్తుండగా ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొనగా సంఘటన స్థలంలోనే మృతిచెందింది. ఈ విషాద సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని ఈద్‌గాం గ్రామంలో పోస్ట్‌మాస్టర్‌గా రాథోడ్ కల్పన (19) పనిచేస్తోంది. కుటుంబ సభ్యులు గతంలో కుంటాల మండలంలోని ఓలా గ్రామానికి వలస వచ్చారు. ఇక్కడే తండ్రి రాథోడ్ దత్తురాం ఓ రైస్‌మిల్లులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడు నెలల క్రితమే కూతురు కల్పనకు తపాలా శాఖలో బీపీఎంగా ఉద్యోగం వచ్చింది. కూతురి ఆరోగ్యం బాగోలేక తండ్రి తీసుకురావడానికి కాగజ్‌నగర్ వెళ్లాడు. తిరిగి ఇంటికి బైపాస్ మీదుగా మహబూబాఘాట్స్ నుంచి బైక్‌పై వస్తుండగా గోపాల్‌పేట్ ఎక్స్‌రోడ్డు మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కల్పన ఎగిరిపడి తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. తండ్రి దత్తురాంకు తీవ్ర గాయాలు కాగా ప్రస్తుతం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబానికి కుమారుడిలా చేదోడువాదోడుగా నిలిచే కుమార్తె మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వసంత్ తెలిపారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఒకరి మృతి



రాములు మృతదేహం

గుడిహత్నూర్: మండలంలోని సీతాగొంది గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఏఎస్సై బలరాం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సీతాగొంది గ్రామానికి చెందిన అర్క రాములు (37) జాతీయ రహదారి దాటుతుండగా ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వైపు వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రాములు తీవ్రంగా గాయపడగా 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. బైక్‌తో ఢీకొన్న వ్యక్తికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద శనివారం రాత్రి ఆటో బోల్తాపడగా చోదకుడు మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపాడు. ఆయన వివరాల ప్రకారం.. హంగిర్గా గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె గౌతం(35) ఆటో చోదకుడు హంగిర్గా గ్రామం నుంచి ఆటోలో భైంసాకు వెళ్తున్నాడు. హంగిర్గా గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో బోల్తాపడగా గౌతంకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు అతడిని చికిత్స నిమిత్తం భైంసా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి శాంరావ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

జిల్లాకు సివిల్ సర్వీసెస్ ట్రైనీ అధికారులు



కలెక్టర్‌తో సమావేశమైన ట్రైనీ అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇండియన్ స్టాటికల్ సర్వీసెస్, ఇండియన్ ఎకనామికల్ సర్వీసెస్ విభాగానికి చెందిన సివిల్ సర్వీసెస్ ట్రెయినీ ఫౌండేషన్ కోర్స్ శిక్షణలో భాగంగా 21మంది శనివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వరుణ్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జిల్లాలో చేపట్టిన పనుల, ఏ ఏ శాఖ ద్వారా ఏ పనులు జరుగుతున్నాయో వీరికి ఆయన వివరించారు. ఆదివారం నుంచి వీరు నాలుగు టీములుగా విడిపోయి ఐదు రోజులు మన జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో పాల్గొన్నారు.

నచ్చన్‌ఎల్లాపూర్‌లో..



నచ్చన్‌ఎల్లాపూర్ జీపీ కార్యాలయం వద్ద

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ట్రెయినీ సివిల్ సర్వీసెస్ అధికారులు పర్యటించారు. ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్‌ఎస్), ఇండియన్ ఎకానమిక్ సర్వీస్ (ఈఎస్‌ఎస్)కు చెందిన సందీపన్ సర్కార్, బంటి కుమార్, ఆలీషా ఖానం, ప్రీతంసేన్, సౌమ్య బుదిరాజా ఉన్నారు. సర్పంచ్ బొడ్డు గంగన్న గ్రామాభివృద్ధి పనులు వివరించి సన్మానించారు. ఇందులో ఎంపీడీవో లింబాద్రి, తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీవో వెంకటేశ్, ఏపీఎం రాజారాం, ఏపీవో జయదేవ్ ఉన్నారు.

పార్‌పెల్లికి ట్రైనీ ఐఈఎస్, ఐఎస్‌ఎస్‌లు..



పార్‌పెల్లి జీపీ వద్దకు చేరిన ట్రైనీ ఐఈఎస్,ఐఎస్‌ఎస్‌లు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామాన్ని ట్రెయినీ ఐఈఎస్, ఐఎస్‌ఎస్‌లు పరిశీలించారు. వీరు ఇక్కడ ఈ నెల 10వరకు ఉండనున్నారు. వీరికి ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దిన్ స్వాగతం పలికారు. పార్‌పెల్లి గ్రామ పంచాయతీలో వీరికి బస ఏర్పాటు చేశారు. ఇందులో సైఫ్ అలీ, వీణసింగ్, మీనా, రాహుల్ సింగ్, భావన జోషి ఉన్నారు. ఇందులో ఎంపీడీవో మోహన్, ఎంపీవో నసీరుద్దీన్, సర్పంచ్ రాజేందర్ ఉన్నారు.

ఎర్వచింతల్ గ్రామానికి..



ఎర్వచింతల్ గ్రామానికి వచ్చిన అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామానికి ఆరుగురు మహిళ ట్రైనీ అధికారుల బృందం చేరుకుంది. ఇండియన్ ఎకానామి సర్వీస్‌కు చెందిన ముగ్గురితో పాటు ఇండియన్ స్టాటికల్ సర్వీస్‌కు చెందిన ముగ్గురు ఉన్నారు. వీరికి గ్రామంలోని పంచాయతీ భవనంలో ఎంపీడీవో మల్లేశ్, సర్పంచ్ కొడారి గోపాల్, ఎంపీటీసీ వాల్‌సింగ్‌ల ఆధ్వర్యంలో బస ఏర్పాటు చేశారు. ప్రభుత్వాల పథకాలు, ప్రజల స్థితిగతులు, తదితర విషయాలపై అధ్యయనం చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

హోటళ్లలో గృహావసర గ్యాస్ వినియోగించొద్దు

కైలాస్‌నగర్: హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు గృహావసర సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లను శనివారం ఆయన తనిఖీ చేశారు. రాంనగర్‌లోని ఓ హోటల్‌లో అక్రమంగా వినియోగిస్తున్న మూడు వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని సంబంధిత ఏజెన్సీకి తరలించారు. అలాగే గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న షాపును సందర్శించి వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోటళ్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లనే వినియోగించాలన్నారు. వంట గ్యాస్‌ను దుర్వినియోగం చేస్తే సిలిండర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్యాస్ రీఫిల్లింగ్ సైతం చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై సైతం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



హోటల్‌లో వినియోగిస్తున్న వంట గ్యాస్ సిలిండర్‌ను పరిశీలిస్తున్న డీటీ